నిధులున్నా ముందుకు సాగని పనులు

- శాలిగౌరారం–గురుజాల డబుల్ రోడ్డుకు రూ.5 కోట్లు మంజూరు
- కల్వర్టులు మినహా నేటికీ మొదలుకాని పనులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు


దెబ్బతిన్న శాలిగౌరారం–గురుజాల ప్రధానరోడ్డు

శాలిగౌరారం: రవాణా వ్యవస్థను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ కొందరి నిర్లక్ష్యం వల్ల రోడ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. మండలంలో శాలిగౌరారం–గురుజాల ప్రధాన ఎండీఆర్(మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు) ఆర్అండ్‌బీ రోడ్డును రూ.5 కోట్ల వ్యయంతో 2.1 కిలోమీటర్ల డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు గత సంవత్సరం జూన్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ పనులు ప్రారంభం కాలేదు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేల్ డిసెంబర్ 31న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.

పూర్తికాని తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్ల షిఫ్టింగ్‌లు

శాలిగౌరారం–గురుజాల రోడ్డుపై మూడుచోట్ల పైపు కల్వర్టుల మినహా రోడ్డు నిర్మాణ పనులు జరుగలేదు. రోడ్డువెంట ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్‌తోపాటూ విద్యుత్‌లైన్లను మార్పు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పైపులైన్ల మార్పిడి జరుగుతుండగా విద్యుత్ లైన్ల మార్పిడి విషయంలో సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. విద్యుత్, తాగునీటిపైపు లైన్ల మార్పిడి జరిగితేనే రోడ్డు నిర్మాణ పనులు జరుగనున్నాయి.

సమీపిస్తున్న అగ్రిమెంట్ గడువు

శాలిగౌరారం నుంచి గురుజాల రోడ్డుకు సీఆర్ఐఎఫ్(సెంట్రల్ రోడ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్) నుంచి ప్రభుత్వం రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో 1.60 కిలో మీటర్లు బీటీ డబుల్ రోడ్డుతో పాటూ శాలిగౌరారం బస్టాప్ సమీపంలో బాక్స్ బ్రిడ్జి, రామగిరిలో 400 మీటర్లు పొడవు సీసీ డబుల్ రోడ్డు వేయనున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుతోపాటు పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక అనుమతులు 2023 ప్రారంభంలోనే వచ్చాయి. అధికారులు ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయగా సూర్యాపేటకు చెందిన డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకుంది. రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి 18 నెలల గడువుతో జూన్ 2023లో అగ్రిమెంట్ కూడా జరిగింది. అగ్రిమెంట్ జరిగి 10 నెలలు పూర్తి కావొస్తోంది. ఇదిలా ఉండగా ఆర్అండ్‌బీ అధికారులు శాలిగౌరారం నుంచి గురుజాల వరకు 4.7 కిలోమీటర్లు డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచేందుకు సుమారు రూ. 12 కోట్ల వ్యయానికి ప్రతిపాదనలు పంపితే 2.1 కిలోమీటర్లు అభివృద్ధి పరచేందుకు రూ. 5 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

10 గ్రామాల ప్రయాణికులకు ప్రయోజనం

మండలానికి ప్రధాన రోడ్డుగా ఉన్న శాలిగౌరారం–గురుజాల సింగిల్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మండలంలోని 10 గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రంతో పాటూ నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట పట్టణాలకు వెళ్లాలంటే ఈరోడ్డు గూండానే వెళ్లాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా మూసీనదిపై గురుజాల–మానాయికుంట గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో వాహనాల రాకపోకలు మరింతగా పెరిగాయి.

రవాణా సౌకర్యం మెరుగుపరచాలి



“శాలిగౌరారం–గురుజాల రోడ్డును అభివృద్ధి పరిచి ప్రజలకు, ప్రయాణికులకు రవాణా సౌకర్యాలను మెరుగుపరుచాలి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తుంది. రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి.

– గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌జి కొత్తపల్లి

విద్యుత్ లైన్లు తొలగించాలని కోరాం



“శాలిగౌరారం–గురుజాల ఆర్అండ్‌బీ రోడ్డు పనులు ఇప్పటికే పనులు ప్రారంభించాం. రోడ్డుపై పైపుకల్వర్టుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రోడ్డువెంట ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్లతోపాటూ విద్యుత్ లైన్లు ఉన్నాయి. వాటిని మార్పిడి చేయాలని సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించాం. తాగునీటి పైపులైన్ల మార్పిడి పనులు జరుగుతున్నాయి. లైన్ల మార్పిడి పూర్తికాగానే రోడ్డు అభివృద్ధి పనులు చేపడతాం.

– సంతోష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈ

క్లుప్తంగా

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

నల్లగొండ రూరల్: బీజేవైఎం నల్లగొండ మండల అధ్యక్షుడిగా నల్లగొండ మండలంలోని ఎం.దుప్పలపల్లి గ్రామానికి చెందిన బొమ్మిడి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్ సోమవారం శ్రీకాంత్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ కన్వీనర్‌గా నాగరాజు

నార్కట్‌పల్లి: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఐటీ సెల్ జిల్లా కన్వీనర్‌గా నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన పంజాల నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీను సోమవారం నాగరాజుకు నియామకపత్రం అందజేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

నల్లగొండ రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నల్లగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దుబ్బాక మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం మల్లేష్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ


ప్లేట్లు అందజేస్తున్న హెచ్ఎం రమణారావు

కట్టంగూర్ : మండలంలోని కురుమర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన జానపాటి ముత్తయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె హిమబిందు, కుటుంబ సభ్యుడు అశోక్ ఇచ్చిన లంచ్ ప్లేట్స్‌ను సోమవారం హెచ్ఎం బోయినపల్లి రమణారావు అందజేశారు.

రేషన్ దుకాణాల పరిశీలన

మర్రిగూడ: మండల కేంద్రంతోపాటు యరగండ్లపల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం డివిజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్ఐ హబీబ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పనులు ప్రారంభించాలి

నకిరేకల్ : వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లో మార్కెట్ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తిచేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

రూ.2.80 లక్షలు పట్టివేత

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.2.80లక్షలను పోలీసులు పట్టుకున్నారు. వివిధ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు సరైన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని జిల్లా అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

మర్రిగూడలో రూ.1.50లక్షలు..

మర్రిగూడ : ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సీజ్ చేశారు. మర్రిగూడ ఎస్ఐ కె.రంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన కె.నాగరాజు కారులో తీసుకెళ్తున్న రూ.1.50లక్షల నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రమేష్, సైదులు, రమేష్, సతీష్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ: మండల కేంద్రంలో యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో సాక్షి దినపత్రికలో శుక్రవారం 'కొనుగోలు కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యం'అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చిన ముసయ్య, ఏఓ హేమలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు డి.గీత, కోశాధికారి శాంతి, ఏపీఎం ప్రభాకర్, ఆర్ఐ పాండురంగారెడ్డి, సీసీలు భారతమ్మ, శ్రీశైలం పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కట్టంగూర్ : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం ముందస్తుగా ఉగాది పండగ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు ఒకరికొకరు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు జి.యాదగిరి, ఎం. సంపత్, వెంకటప్రసాద్, నాగమణి, పద్మ, మహేశ్వరి, రేణుక, స్వప్న, ఆకాంక్ష, మంగ, లక్ష్మి, మద్దెల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

కేతేపల్లి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గుడివాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనులు చేసే కూలీలను కలిసి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టౌన్ : నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఇచ్చిన తప్పుడు ధృవీకరణ పత్రాలను వెంటనే రద్దు చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ గొల్లగూడకు చెందిన ఎ.పద్మ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. హైకోర్టుకు వెళితే కోర్టును తప్పుదోవ పట్టించేవిధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని..

నల్లగొండ టౌన్ : గత సంవత్సరం సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు స్త్రీ శిశు సంక్షేమాధికారికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కలిగించే సర్క్యులర్ 1334 వెంటనే ఉపసంహరించాలని కోరారు. ఖందెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ, ఎం.ప్రకృతాంబ, రాజేశ్వరి, స్వప్న, సరిత పాల్గొన్నారు.

స్థలాన్ని పరిరక్షించాలని..

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలోని శివాలయం వీధిలో ఉన్న కాకతీయుల నాటి శ్రీ లక్ష్మీగణపతి విగ్రహం వెలిసిన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో బీజేపీ నేతలు గోలి మధుసూదన్‌రెడ్డి, ఆలయ నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రహ్మదేవర రవిశంకర్, మండల వెంకన్న, పందాల సైదులు, పాపని చంద్రశేఖర్, రాంబాబు, మేడిపల్లి శివ, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

రైతుల శ్రమదానం


నీటి వృథాను అరికడుతున్న రైతులు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వ నుంచి రామన్నపేట మండలం తుర్కపల్లి వద్ద ధ్వంసమైన తూముల ద్వారా వృథాగా పోతున్న వరదనీటిని రామగిరి గ్రామానికి చెందిన రైతులు సోమవారం శ్రమదానం చేసి అరికట్టారు. తూముల వద్ద గడ్డికట్టలు అడ్డుగా పెట్టి నీటి వృథా జరగకుండా చేశారు. రామగిరి గ్రామానికి చెందిన ప్రాజెక్టు ఆయకట్టు రైతు ప్రతినిధులు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో రైతులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో రామగిరి మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీను, రైతులు మొగుళ్ళ శ్రీను, చిరబోయిన నర్సయ్య, ఆకుల యాదగిరి, మాద నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది సందడి


మామిడి తోరణం కడుతున్న మహిళలు, యువతులు


నల్లగొండలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు


కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రామగిరి(నల్లగొండ): ఉగాది వేడుకలను జిల్లా కేంద్రంలో ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకోనున్నారు. సాహితీ సంస్థల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు అందజేయనున్నారు. అదేవిధంగా ఆలయాల్లో, ప్రముఖుల నివాసాల్లో పురోహితులతో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ఉగాది వేడుకలు జరుపుకోవడానికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసే ప్రజలతో సోమవారం వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి.

నకిరేకల్ : ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించుకునేందుకు నకిరేకల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆలయాలను ముస్తాబు చేశారు. నకిరేకల్, కేతేపల్లి, చిట్యాల, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, కట్టంగూర్ మండల కేంద్రాల్లోని ప్రధాన ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా మండల కేంద్రాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. నకిరేకల్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి, ఐశ్వర్య సాయి, శివాలయ, సత్య సాయి, గీతా మందిరం, పద్మశాలి భవన్‌లో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. ఉగాది సందర్భంగా స్థానిక శివాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలకు వేద బ్రాహ్మణులతో నిర్వహించనున్నామని నకిరేకల్ శివాలయ చైర్మన్ ఉప్పల రమేష్ తెలిపారు.

శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖః సంతోషాలతో ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకాంక్షించారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి పంటలు పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : వేసవిలో ప్రజల దాహర్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద సాయి శ్రీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాయి శ్రీ కన్సల్టెన్సీ డాక్యుమెంటరీ రైటర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ 13 సంవత్సరాల నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్ రెడ్డి, సమ్మద్, కందుకూరి భద్రయ్య, జీవీ యాదవ్, డాక్యుమెంట్ రైటర్స్ భాస్కర్ రెడ్డి, కలీముల్లా, సురేష్, శ్యాం శైలేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు


కంది సూర్యనారాయణను సన్మానిస్తున్న సుంకరి మల్లేష్‌గౌడ్

నల్లగొండ టౌన్ : వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు శ్రీ సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్–కళావతి దంపతులు ఉగాది పురస్కారాలు అందజేశారు. ముందుగా ఉగాది పర్వదినం సందర్భంగా చేసిన భక్షాలు, ఉగాది పచ్చడిని అతిథులకు అందజేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో బీసీ సంఘం నాయకుడు కంది సూర్యనారాయణ, జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుచ్చర్ల సత్యనారాయణ, ప్రముఖ కవి వేణు సంకోజు, సంఘ సేవకుడు ఏనుగుల లక్ష్మారెడ్డి, వయోవృద్ధుల సంఘం సభ్యుడు కంది మట్టపల్లి, ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ పుల్లారావు, సంఘ సేవకురాలు పిచ్చమ్మ, న్యాయ నిపుణురాలు మామిడి ప్రమీల, తెలంగాణ ఉద్యమకారుడు కె.పర్వతాలు, సీపీఐ నాయకుడు పబ్బు వీరస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, ప్రముఖ కవులు అంబటి వెంకన్న, మునాస వెంకన్న, సంఘ సేవకుడు ఎల్వీ కుమార్, ఎంబీసీ రాష్ట్ర నాయకుడు కొండూరు సత్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో చీర పంకజ్‌యాదవ్, సుంకరి భిక్షంగౌడ్, లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి మల్లేష్‌ను కలిసిన ఎంపీటీసీలు


మల్లేశ్‌కు బొకే అందజేస్తున్న ఎంపీటీసీలు

చిట్యాల: భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను హైదరాబాద్‌లో సోమవారం చిట్యాల ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య యాదవ్ ఆధ్వర్యంలో పలువురు ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా క్యామ మల్లేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విజయానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పనిచేయాలని కోరారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు దేవరపల్లి సత్తిరెడ్డి, గొలనుగొండ దశరథ, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.మోసీన్, కొలను వెంకటేష్‌గౌడ్, మర్ల రాంరెడ్డి, ముద్దసాని రమణారెడ్డి, యేళ్ళ సత్యనారాయణరెడ్డి, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉయ్యాల లింగయ్య, పులిమామిడి శ్రీనివాస్‌రెడ్డి, పాకాల నర్సింహ, సైదులు, మర్రి సురేష్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : గ్రామాల్లో నీటి సమస్య రాకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నార్కట్‌పల్లి మాజీ సర్పంచ్ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు గాను గత మూడేళ్ల బిల్లులను ఒకేసారి తీర్మానం చేసి ఎలా తీసుకుంటాడని ఏఅని ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య ప్రశ్నించారు. నార్కట్‌పల్లి పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీలు ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికను చదివి వినిపించారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెరువు మట్టిని ఇటుకల బట్టీలకు తరలించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో బోర్లు అడుగంటిపోతున్నాయని, నీటి సమస్య రాకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అరుణ్‌కుమార్, సంతోష్, ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని 41, 30వ వార్డుల నుంచి పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల నుంచి మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న వారిని బీఆర్ఎస్ నేతలు వేధింపులకు గురి చేయడంతో బీఆర్ఎస్‌లో చేరారని, వారంతా తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, కౌన్సిలర్ కేసాని వేణు, షేక్ జహంగీర్‌బాబా, నాగరాజు, జూలకంటి సైదిరెడ్డి, కార్తీక్, సిద్దు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లపై తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం కల్వలపాలెంకు చెందిన చిట్యాల ప్రవీణ్, దాసరి నవీన్, తిప్పర్తి మండలం ఇండ్లూకు చెందిన బెల్లి విజయ్ ట్రాక్టర్ల ద్వారా మాడ్గులపల్లి మండలం బొమ్మకల్లు నుంచి ఇండ్లూరుకు ఇసుక తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.రాజు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కట్టంగూర్: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రాధారపు అండాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ద్వారా విషయం తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్ రూ.10వేలను సోమవారం పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లి మహాలక్ష్మీసుధాకర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి హనుమయ్య, నల్లగొండ సైదులు, సతీష్, సాయిలు, వెంకన్న, హరి, రాజు ఉన్నారు.

ఎమ్మెల్యే, టీజీఓ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


నార్కట్‌పల్లి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నల్లగొండలో టీజీఓ ఆధ్వర్యంలో..

రామగిరి(నల్లగొండ): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్‌బీఆర్ గార్డెన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ముజుబుద్దీన్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు మోహన్‌రావు, ఇస్మాయిల్, కిరణ్‌కుమార్, మంగ్యానాయక్, టీఎన్‌జీఓ అధ్యక్షుడు నాగిళ్ళ మురళి, సెక్రటరీ శేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఆర్డీఓ రవి, జిల్లా అధికారులు రాజ్‌కుమార్, తిరుపతయ్య, దీపారెడ్డి, శిరీషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు సోమవారం సాయంత్రం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల బత్తుల ఉషయ్య, బండ సాగర్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, రుద్రరెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు సమద్, అజీజ్, సాదత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కరీంపాష

కనగల్: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎంపీపీ కరీంపాష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ధాన్యం కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవికాలం కావడంతో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, రైతులకు రెండు,మూడు రోజుల్లో ధాన్యం డబ్బులు ఇచ్చేలా చూడాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ జయరాం, కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, ఏఈలు రాజశేఖరాచారి, షఫీ, వెటర్నరీ డాక్టర్ సీహెచ్ బాబు ఆయా గ్రామాల ఎంపీటీసీలు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.300 దినసరి కూలీ ఇవ్వాలి

కేతేపల్లి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు దినసరి వేతనం రూ.300 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కేతేపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య తదితరులు ఉన్నారు.

అన్నప్రసాద వితరణ

నకిరేకల్ : అమావాస్య సందర్భంగా నకిరేకల్‌లోని వాసవి, వనితా క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగాం కోఆర్డినేటర్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం 250 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. క్లబ్ ప్రతినిధులు ఉప్పల వెంకటరమణ, దేవరశెట్టి సత్యనారాయణ, బ్రహ్మదేవర బ్రహ్మయ్య, అనిత, రాంమోహన్, కందగట్ల భవాని, గుండా గోపిక, ఉప్పల శివ కృష్ణ, వజ్రపు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.